కానప్పుడతని చూపుల్లో ఎలాంటి భావమూ వ్యక్తం కాలేదు. తన అంచనా దెబ్బతింది ఆలోచనలు తల క్రిందులయ్యాయి. అసలతను ఎవరు? ఎక్కడుంటాడు? ఏం చేస్తుంటాడు? ఏది ఏమైనా వీలయితే మరోసారి అతన్ని కలిసే ప్రయత్నం చేయాలి.

తన అన్నను చిన్నవయసులోనే దారుణంగా చంపిన వ్యక్తి అతనేనని, అతనే పరమశివం కొడుకని ఆమెకు తెలిసివుంటే ఆమె ఆలోచనల్లో అగ్నిసెగలే రేగేవో అతని అంతానికి హద్దులే గీసేవో? అప్పుడు రాత్రి పదకొండు గంటలవుతుంది. ఓ ప్రక్క ఉదయ్ గురించిన ఆలోచనలు మరో ప్రక్క సుందరమ్మ చిట్‌ఫండ్ కంపెనీ ఫాలోఅప్ న్యూస్ గురించి అర్థరాత్రి దాటేవరకూ ఆలోచిస్తూ అలాగే నిద్రలోకి జారిపోయిందామె.

0 0 0

సుందరమ్మ ఆ రాత్రంతా కూర్చుని ఎవరెవరు ఎంత సొమ్ము చెల్లించింది, ఎవరెవరికి తనెంత బాకీ వుంది క్షుణ్ణంగా లెక్కలు వేయించింది. మరుసటిరోజే చందాదారులంతా తన వద్దకువచ్చి సొమ్మును రెండు రూపాయల వడ్డీతో సహా తీసుకెళ్లవచ్చని తన అనుచరులద్వారా ప్రచారం చేయించుకునేందుకు రంగం సిద్ధం చేసింది.

ఆమెకిప్పుడు మహదానందంగా వుంది. తనపై అమాయక ప్రజలకున్న విశ్వాసాన్ని రెట్టింపు చేసుకోబోతున్నానన్న ఆనందం ఆమెను నిలువనివ్వడంలేదు. అదే రేపు తనకు మరింత సొమ్మును తెచ్చిపెడుతుంది.

ఆమె ఆలోచనలలా సాగుతున్న సమయంలో ఉదయ్ చేతుల్లో దెబ్బతిన్న నలుగురు రౌడీలొచ్చి ఆమెముందు నిల్చున్నారు తలలు వంచుకుని. వాళ్ళ వాలకాల్ని చూడగానే ఆమె కనుబొమలు అనుమానంగా పైకి లేచాయి. "ఏం జరిగింది? ఆ పిల్లను తీసుకొచ్చారా?" ఆమె మామూలుగానే అడిగింది.

"లేదండీ..." ఒకడు భయపడుతూనే అన్నాడు.

"శభాష్, మంచిపని చేశారు" అందామె చిరునవ్వుతో.

ఆ నలుగురు ఒక్కసారిగా షాక్ తిన్నారు సుందరమ్మ మాటలకు. దున్నపోతుల్లా తినబలిశారు. ఒక్క ఆడపిల్లను తేలేకపోయారా అని మందలిస్తుందేమోనని భయపడుతుండగా హఠాత్తుగా ఆమె శభాష్ అనటం విచిత్రంగా అనిపించింది.

ఆమె ఆ మాట నిజంగానే అందా? లేక తమ అసమర్థతను ఎత్తి చూపేందుకు అందో వారికింకా అర్థం కాలేదు.

"మీ వాలకం చూస్తుంటే జరిగిందేమిటో ఇట్టే అర్థమైపోతుంది. ఎవరో అ అమ్మాయికి రక్షణగా వచ్చి మిమ్మల్ని చావ చితకబాదుంటారు. అదీ నా మంచికే జరిగింది. నిజంగానే మీరా అమ్మాయిని తెచ్చివుంటే మరింత రభస అయివుండేది. పైగా ఆ అమ్మాయి జర్నలిస్టు.

జర్నలిస్టుల జోలికి వెళ్ళటం చాలా ప్రమాదకరమట, మధుమూర్తి చెప్పాడు. మీరిక లోపలికెళ్ళి కట్టుకట్టించుకోండి" అందామె సౌమ్యంగానే.

వాళ్ళు ఒక్కసారి ఊపిరి తీసుకుని క్షణాల్లో ఆమె ముందునుంచి అదృశ్యమైయ్యారు.

0 0 0

సరిగ్గ అదే సమయంలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో వున్నాడు సర్కిల్. అంతకుముందే జైలుకి ఫోన్ చేసి ఉదయ్ ఎవరు? అతని కుటుంబ వివరాలు, అతనికి శిక్ష పడటానికి కారణాలు అన్నిటిని తనకు యుద్ధప్రాతిపదికపై అందించమని జైలు సూపరింటెండెంట్ గంగాధరరావుని అడిగాడు. అడుగుతూ చిన్న చిట్కా ప్రయోగించాడు, అవన్నీ యుగంధర్‌కి చాలా అవసరమని.

యుగంధర్ తనకు కాబోయే అల్లుడన్న అభిమానంతో గంగాధరరావు అప్పటికప్పుడు ఉదయ్ వివరాల్ని అందించేందుకు సిద్ధపడుతూ అరగంట ఆగి ఫోన్ చేస్తే వివరాలన్నీ అందిస్తానని చెప్పటంతో నిమిషాలు లెక్కిస్తూ అక్కడే వుండిపోయాడు సర్కిల్.

గంగాధరరావు ఉదయ్ జైలు రికార్డుని తెప్పించి వివరాలు నోట్ చేసుకోనారంభించాడు క్షణాలు... నిమిషాలు గడిచిపోతున్నాయి. గంగాధరరావు ముందున్న తెల్లకాగితం ఉదయ్‌కి సంబంధించిన వివరాలతో క్రమంగా నిండిపోతోంది. ఇక్కడ స్టేషన్‌లోవున్న సర్కిల్ ఆలోచనలు తిరిగి హోటల్‌పైకి మారాయి.

"హలో... గంగాధరరావుగారు వివరాలు దొరికాయా?" ఈ వేపు నుంచి సర్కిల్ అడిగాడు అరగంట తర్వాత.

"కొన్ని దొరికాయి"

"చెప్పండి"

"ఉదయ్ చిన్నప్పుడే తన బాల్యమిత్రుడ్ని చంపినందుకు శిక్షపడింది. ఏలూరు సర్టిఫైడ్ స్కూలుకి పంపింది కోర్టు. అతనికి పదహారో సంవత్సరం వచ్చేసరికి వదిలేయాలని కూడా కోర్టు శాసించడం జరిగింది. అతని తండ్రి పేరు పరమశివం. అతను సంవత్సరానికి రెండుసార్లు చూసేందుకు వచ్చేవాడు కానీ రూల్స్ అంగీకరించినా పరమశివం తన కొడుకునెందుకో సెలవుల్లో ఇంటికి తీసుకెళ్ళేవాడుకాదు.

అక్కను, తల్లిని చూడాలనే కోరిక అతనిలో రోజుకు పెరుగుతూ పోయింది. ఉదయ్ తనను ఇంటికి తీసుకెళ్ళమని తండ్రిని ఎంతగానో బ్రతిమిలాడేవాడట. అయిన అతడు తీసుకెళ్ళేవాడు కాదు. దాంతో అతను ఎప్పుడు ఉదాసీనంగా ఉండటం చాలామంది గమనించారట. సర్టిఫైడ్ స్కూల్‌లో అతను పదవ తరగతివరకు చదివాడు. మోస్టు బ్రిలియంట్ స్టూడెంట్. అతనికి పదవతరగతిలో క్లాస్‌వచ్చింది. ఓసారి అమ్మను, అక్కను చూపించమని ప్రాధేయపడ్డాడట. కాని పరమశివం అంగీకరించలేదు.

దాంతో ఓ రోజు ఎప్పుడూ క్రమశిక్షణలో వుండే ఉదయ్ కూలిన సర్టిఫైడ్ స్కూల్ గోడ దూకి తప్పించుకుని పారిపోయాడు. అయితే ఈలోపు స్కూల్ సెంట్రీలు పసిగట్టి రైల్వేస్టేషన్‌లో

తిరిగి అతన్ని చేజిక్కించుకున్నారు.

ఆ సమయంలో ఉదయ్ ఒక సెంట్రీని ఒకింత గాయపరిచడం కూడా జరిగింది. దాతో అతనికి శిక్షణాకాలం పెరిగి సర్టిఫైడ్ స్కూల్ నుంచి విశాఖపట్నం బోస్టన్ స్కూల్‌కి పంపించడం జరిగింది. పాపం అతని శిక్షా కాలాన్ని అతనే పొడిగించుకున్నాడు. మరొక రెండు నెలలు అతను స్కూల్‌నుంచి పారిపోకపోయి వుంటే స్వేచ్ఛావాయువులు పీల్చి వుండేవాడు.

విశాఖపట్నం బోస్టన్ స్కూల్‌కి పంపించాక తిరిగి తన చదువు కొనసాగించాడు ఉదయ్. ఈ సంగతి తెలుసుకున్న పరమశివం విశాఖపట్నం బోస్టన్ స్కూల్‌కి వెళ్ళి ఉదయ్‌ని కలిసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడట.

ఉదయ్ తండ్రిని కలిసేందుకు ఇష్టపడలేదట. కాలగమనంలో ఇంటర్ మీడియట్ ఫస్టుక్లాసులో ఉత్తీర్ణుడయ్యాడు. జెయిల్ రూల్స్ ప్రకారం శిక్షననుభవిస్తున్న వ్యక్తి ప్రవర్తనలో గుర్తించదగ్గ మార్పువస్తే అతన్ని వదిలివేయవచ్చు. అలాంటి మంచి మార్పు ఉదయ్‌లో వచ్చిందని బోస్టన్‌స్కూల్ సూపరింటెండెంట్ గుర్తించి అతన్ని విడుదలచేసేందుకు ఫార్మాలిటీస్ పూర్తి చేస్తున్న సమయంలో పరమశివం ఉదయ్‌ని కలుసుకునేందుకు మరల వచ్చాడు.

సరిగ్గా ఆ సమయంలో ఉదయ్ కరాటే ప్రాక్టీస్‌లో వున్నాడు. తండ్రిదగ్గరకు వచ్చి పలకరించేసరికి అతను “నువ్వు రాక్షసుడివి, తండ్రివి కాదు. కనీసం ఒక్కసారి అమ్మను, అక్కను చూపించమంటే చూపించలేదు. నువ్వు నా తండ్రివేకాదు పో ...” అని అన్నాడట.

దాంతో పరమశివం కొడుకును మందలించబోయాడట. దాన్ని సహించలేని ఉదయ్ తండ్రిమీదనే చెయ్యి చేసుకోబోయాడట. ఆ సంఘటన పదిమందిముందు జరగటంతో తిరిగి అతని శిక్షా కాలం పొడిగించబడింది. ఆ తరువాత ఉదయ్ మరింత కఠినంగా మారిపోవటాన్ని అధికారులు గమనించారు.

తనకై తాను ఎవరి జోలికి వెళ్ళేవాడుకాదట. అనవసరంగా తన జోలికెవరన్నా వస్తే మాత్రం ఎముకలు పిప్పిచేసేవాడట. తనలో వచ్చిన ఆ మార్పును చూసి అధికారులు అతని శిక్షా కాలం పూర్తికాగానే విడుదల చేయకుండా మా జెయిల్‌కి పంపించారు.

అతను మా జైలులో అడుగుపెట్టేనాటికి అతనికి పద్దెనిమిదేళ్ళు నిండి పందొమ్మిది వచ్చాయి” గంగాధరరావు కొద్దిసేపు చెప్పడం ఆపాడు. సర్కిల్ ఆశ్చర్యపోతూ శ్రద్ధగా వింటున్నాడు.

“మా జైలుకి వచ్చాక అతను మా అమ్మాయి బ్రాహ్మణి దృష్టిలో పడటం జరిగింది. మా అమ్మాయి సైకాలజీ స్టూడెంట్. ఓరోజు ఏదో సినిమా ప్రొజెక్షన్ ఏర్పాటు చేశాం. తోటి ఖైదీలు సినిమా చూద్దాం రమ్మని ఎంత బ్రతిమిలాడినా అతను రాలేదు. ఈలోపు సినిమా మొదలయిన పావుగంటకు ఉదయ్ పెనుకేక వేస్తూ తుఫాన్‌లా అక్కడికి దూసుకువచ్చి సినిమా స్క్రీన్‌ని సర్వనాశనం చేశాడు. అదొక్కటే అతను జైల్లో చేసిన తప్పు.

ఆ తరువాత అతన్ని మా అమ్మాయి బ్రాహ్మణి రోజు కలిసి అతనిని

ప్రశ్నించసాగింది. క్లుప్తంగా యిదీ అతని జీవితం" అని ఆగిపోయాడు గంగాధరరావు. ఆ తరువాత కూడా కొంత కథ జరిగినా దాన్ని బయటకు చెప్పటం గంగాధరరావు కిష్టం లేదు..

"అయితే అతనిప్పుడు తన తల్లిని, అక్కను తప్పక కలుస్తాడు. ఇంతకీ అతనెప్పుడు రిలీజ్ అయ్యాడు సార్?" సర్కిల్ సాలోచనగా అడిగాడు.

"సరిగ్గా వారం అయింది"

"అతని ఇంటి అడ్రస్ వుంటే యిస్తారా?" సర్కిల్ అడిగాడు.

"సారీ! అతనింటి అడ్రస్ అతనికి తెలీదు, మాకు తెలీదు. అప్పుడప్పుడు అతని తండ్రి పరమశివం నా దగ్గరకు వచ్చి కొడుకు క్షేమసమాచారాలు కనుక్కుని వెళ్ళాడే కాని అడ్రస్ యివ్వలేదు. జైలునుంచి రేపు విడుదల అవుతాడనగా ఉదయ్ నా దగ్గరకు వచ్చి మాయింటి అడ్రస్ యివ్వమని అడిగాడు. కొత్త అడ్రస్ యివ్వలేని నేను పాత అడ్రస్ మాత్రం మారిపోయిందని చెప్పాను."

"థాంక్యూ వెరీమచ్ సాబ్!" సర్కిల్ ఫోన్ పెట్టేసి బిల్ పేచేసి బయటపడ్డాడు.

అప్పుడు సరిగ్గా రాత్రి ఒంటిగంట అవుతోంది. సర్కిల్ ఆటో ఎక్కి తను బసచేసిన హోటల్ పేరు చెప్పి ఆలోచనలో పడ్డాడు. ఉదయ్‌కిప్పుడు కొత్తయింటి అడ్రస్ తెలీదు, ఇంత పెద్దనగరంలో అదంత తేలికయిన పనేం కాదు. కాని ఒకటి మాత్రం నిజం, అతనిప్పుడు తన తల్లిని, అక్కను చూసేందుకు ఆరాటపడిపోతున్నాడు. ఇంకా అతను తనక్కావలసిన అడ్రస్‌ను పట్టుకోలేకపోయివుంటే... ఆ అవసరాన్ని తను తీర్చగలిగితే అతనిలో గౌసుద్దీన్ ఇంట్లో దొంగతనం చేయటం సులభం... ఆటో హోటల్ ముందాగింది.

రూమ్‌కెళ్ళి స్నానంచేసి భోంచేసి పడుకున్నాడన్న మాటేగాని రాత్రంతా నిద్రపోకుండానే ఆలోచిస్తుండిపోయాడు. ప్రొద్దుటే లేచి త్వర త్వరగా తయారయి టీ బంక్‌కి బయలుదేరుతుండగా ఫోన్ మ్రోగింది.

"హలో"

"నేను యుగంధర్‌ని...ఎంతవరకు వచ్చింది?"

"అతను అసాధారణమయిన తెలివితేటలున్నవాడు సార్. ఈరోజు అతన్ని ఒప్పించగలనన్న నమ్మకం వుంది".

"క్విక్... యు సీ టైం లేదు. మరొక్క రెండురోజుల్లో దొంగతనం జరిగిపోవాలి. ఆ వార్త పేపర్‌లో రావాలి. ఎనీ హెల్ప్ ఫ్రమ్ మై సైడ్ యుగంధర్?" ఆవేపు నుంచి ప్రశ్నించాడు.

"మెరికల్లాంటి ఇద్దరు కానిస్టేబుల్స్‌ను పంపించండి వాళ్ళతో చాలా అవసరం వుంది" సర్కిల్ అన్నాడు.

"ఓకే. ఈ రోజే పంపిస్తున్నాడు వుంటాను మరి" యుగంధర్ ఆ వేపు ఫోన్ పెట్టేశాడు.

సర్కిల్ ఫోన్‌ని క్రెడిల్ చేసి హడావుడిగా బయలుదేరాడు.

0 0 0

సుందరమ్మ ఫైనాన్స్ అండ్ ఇన్‌వెస్ట్‌మెంట్స్ కంపెనీ వున్న బిల్డింగ్ చందాదారులతో కిటకిటలాడిపోతోంది. పొడవయిన హాల్లో చివర సుందరమ్మ కూర్చుని వుంది. ఆమె ఎదురుగా రెండు కౌంటర్స్‌వున్నాయి. బయటనుంచి క్యూలో వస్తున్న చందాదారులు లోపలికి రాగానే తలో కౌంటర్ వద్దకు పోయి రసీదులు చూపించి డబ్బు వాపసు తీసేసుకుంటున్నారు.

సుందరమ్మ కంపెనీ గోల్‌మాల్ వార్తను కొద్ది రోజుల క్రితం పేపర్‌లో చూసినదగ్గర్నుంచి వారికి మనశ్శాంతి లేకుండా పోయింది. కడుపు పట్టుకుని దాచుకున్న చిన్నచిన్న మొత్తాల్ని సుందరమ్మ ఫైనాన్స్ కంపెనీలో దాచుకుని తప్పు చేసామేమోనని ఇన్నాళ్ళూ తల్లడిల్లిపోయారు. ఈ వార్త అంచెలచెలుగా పాకి ఉషకు చేరింది.

ఆమె ఈ వార్త విని ఆశ్చర్యపోయింది. ఇది కలా? నిజమా? అంటే సుందరమ్మకు నిజంగానే చెడు ఉద్దేశం లేదా? లేనప్పుడు చందాదారులకు ఇవ్వవలసిన పేమెంట్స్‌లో జాప్యం ఎందుకు చేసింది?

నిజంగా నిజాయితీ పరురాలే అయితే తనమీద, తను పనిచేసే పత్రిక మీద పరువునష్టం దావా ఎందుకు వేయలేదు? అందుకు బదులుగా తన మీద దాడి చేయించాల్సిన పనేముంది?

డస్క్ ముందు కూర్చున్న ఆమె ఆ రోజు సేకరించిన వార్తల్ని రాయటంలేదు. పిచ్చిగా ఆరోజు పేపర్ మీద గీతలు గీస్తూ కూర్చుంది. అద్దాలగదిలోంచి పదినిమిషాల నుంచి ఉషవేపే పరిశీలనగా చూస్తున్న రెసిడెంట్ ఎడిటర్ పెదవులమీద సన్నని నవ్వు ఓ క్షణంపాటు మెరిసి అదృశ్యమయింది.